

డైరెక్టర్‌ను పరామర్శిస్తున్న నాయకులు

## డైరెక్టర్ బలరాంకు పరామర్శ

గోదావరిఖని, అక్టోబర్ 18: సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం నాయక్ తండ్రి నునావత్ హుణ్యా నాయక్ ఇటీవల మృతి చెందగా, బుధవారం ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్టు నాయకులు పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మైస రాజేశ్, బొంకూరి మధు, అడకపురం చంద్రమౌళి, ఇరుగురాల కృష్ణయ్య, ఆకునూరి బాల అంకుస్ తదితరులున్నారు.

## దసరా కానుకలు అందజేత

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 18 : దసరా పండుగ సందర్భంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో పని చేస్తున్న కార్మికులకు బుధవారం సాయంత్రం అదనపు కలెక్టర్ మోతీలాల్ కార్యాలయంలో కానుకలు అందజేశారు. జిల్లాలోని మంచిర్యాల ఎంఎల్ఎస్ పాయింట్‌లోని పది మంది, లక్షెట్టిపేటలోని 12 మంది, బెల్లంపల్లిలోని తొమ్మిది మంది, కోటపల్లిలోని నలుగురు, తాండూరులోని ఐదుగురు హమాలీలు ఒక్కొక్కరికి రెండు జతల బట్టలు, రూ. 800 విలువ గల స్వీట్ బాక్సు, రూ.6500 చెక్కును సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం గెడాం గోపాల్‌తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మహిపాల్ సింగ్, డీఆర్పీ రామస్వామి, గంగాధర్, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేటీకే-5 ఇంక్లైన్‌లో అన్నదానం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 18 : భూపాలపల్లి కేటీకే-5 ఇంక్లైన్‌లో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దేవరకొండ మధు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం దుర్గామాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామని, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలి

ములుగు రూరల్, అక్టోబర్18 : ములుగు జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మల్లంపల్లి శివారు గ్రామమైన మంచినీళ్లపల్లిలో నాయకులు బుధవారం సాయంత్రం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టో మినీ పోస్టర్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు చీదర సంతోష్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మల్లంపల్లిని మండలం చేసిన సీఎం కేసీఆర్ రుణాన్ని నాగజ్యోతి గెలుపుతో తీర్చుకోవాలని సూచించారు. ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్, నాయకులు చోటు మహ్మద్, సురేశ్, రాకేశ్‌రెడ్డి, డీ సురేశ్, కుమార్, రమేశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడికి మేనిఫెస్టో మినీ పోస్టర్‌ను అందజేస్తున్న నాయకులు

# లాభాల వాటాకు లైన్ క్లియర్

- ఈ నెల 20, 21న చెల్లించేందుకు యాజమాన్యం అంగీకారం
- దసరా అడ్వాన్స్ చెల్లించేందుకూ ఆమోదం
- సింగరేణి కార్మికులకు ఊరట

గోదావరిఖని/రామగిరి/ శ్రీరాంపూర్, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేసిన సింగరేణి కార్మికుల లాభాల వాటా, దసరా అడ్వాన్స్‌ను ఈనెల 20 లేదా 21న చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. సింగరేణి అధికారులు ఎనర్జీ సెక్రెటరీ గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా చెల్లింపు అంశంతో పాటు దసరా పండుగకు ముందు చెల్లించే అడ్వాన్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఎన్నికల అధికారులకు ఒక బృందంగా వెళ్లి వివరాలు తెలియజేశారు. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన లాభాల నుంచి 32 శాతం వాటా రూ. 700 కోట్లు చెల్లించేందుకు గతంలోనే నిర్ణయం జరిగిందనీ, దీనికి సంబంధించి సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఎన్నికల కోడ్ అమలు కాకముందే సర్క్యులర్ జారీ చేసి ఈనెల 16న చెల్లించేందుకు నిర్ణయించినట్లు అధికారులకు కమిటీ నాయకులు తెలిపారు. దీనికి తోడు సింగరేణి కార్మికులకు ప్రతి ఏటా దసరా పండుగకు ముందుగా అడ్వాన్స్ రూపంలో రూ.25వేలు చెల్లిస్తున్నట్లు, ఈ మొత్తాన్ని కార్మికుల నుంచి పది వాయిదాల్లో రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని అంశాలు పరిశీలించిన అనంతరం ఎన్నికల కోడ్‌లో ఈ చెల్లింపులు వచ్చే అవకాశాలు లేకపోవడంతో సింగరేణి యాజమాన్యం చెల్లింపులకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

### జాతీయ సంఘాల ఆరోపణలు అర్థరహితం



లాభాల వాటా దసరా అడ్వాన్స్ చెల్లింపుకు సంబంధించి జాతీయ కార్మిక సంఘాలు రాజకీయం చేయాలని చూస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగానే సింగరేణి యాజమాన్యం చెల్లింపులను నిలిపివేసింది. జాతీయ కార్మిక సంఘాలకు తెలిసినప్పటికీ వాటిని రాజకీయం చేయడం ద్వారా లబ్ధి పొందాలని చూశాయి. కార్మికులకు ప్రయోజనం కలిగేలా వారికి సకాలంలో చెల్లింపులు చేసేలా చర్యలు చేపట్టాలి కానీ జాతీయ సంఘాలు రాజకీయం చేశాయి. ఈ నెలలో కోలిండియాలో మూడో తేదీన చెల్లించాల్సిన వేతనాలను చెల్లించని క్రమంలో అక్కడ ఎందుకు సమ్మె చేయలేదని జాతీయ సంఘాలను ప్రశ్నిస్తున్నాం. సింగరేణిలో ఏదో రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తే కార్మికులు ఊరుకోరు.

-మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

## కోలిండియా స్థాయిలో రాణించాలి

- మందమర్రి రక్షణాధికారి ఎం రవీందర్



మందమర్రిలో నటరాజు చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఏరియా రక్షణాధికారి రవీందర్

మందమర్రి, అక్టోబర్ 18: సింగరేణి మందమర్రి ఏరియా కళాకారులు కోలిండియా పోటీల్లో ప్రతిభ చూపి మందమర్రి ఏరియాకు గుర్తింపును తీసుకురావాలని ఏరియా రక్షణాధికారి ఎం.రవీందర్ అన్నారు. డబ్ల్యూపీఎస్అండ్ జీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ వార్షిక పోటీల్లో భాగంగా స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో బుధవారం నియర్ బై ఏరియా కల్చరల్ మీట్‌ను ప్రారంభించారు. కళాకారులతో కలసి నటరాజ్ చిత్ర పటానికి పూలమాల వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ఏరియాలో మంచి కళాకారులు ఉన్నారన్నారు. కళాకారులు కోలిండియా పోటీల్లో పాల్గొని మందమర్రి ఏరియాకు, సంస్థకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, క్రీడల సమన్వయ కర్త ఏ.రవికుమార్, జనరల్ కెప్టెన్ చిన్నయ్య, మురహరి, చంద్రకుమార్, డీ సుదర్శన్, కల్చరల్ కెప్టెన్, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



విప్ బాల్కసుమన్ పుట్టినరోజు వేడుకల్లో శ్రీరాంపూర్ ఏరియా టీబీజీకేఎస్ నాయకులు

## ఘనంగా బాల్క సుమన్ జన్మదిన వేడుకలు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 18: చెన్నూర్ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్ జన్మదిన వేడుకలను టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నస్పూర్ మున్సిపల్ పరిధిలోని విలేజ్‌శ్రీరాంపూర్ సాయి అంధుల పాఠశాలలో నాయకులు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బాల్క సుమన్ అనేక పోరాటాలు చేశారని, ఆయన చేసిన పోరాటాల ఫలితమే ఈరోజు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేలా చేసిందన్నారు. చెన్నూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బాల్క సుమన్, ఈ ఎన్నికల్లో కూడా ఘనవిజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. బాల్క సుమన్ ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు డీకొండ అన్నయ్య, చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు వెంగల కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, నాయకులు ల్యాగల శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, రామిడి మహేందర్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, గొర్ల సంతోష్, రమణారెడ్డి, రాజయ్య, పులి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌పై మంత్రి ఎర్రబెల్లి ఫైర్

- కాంగ్రెస్ సభపై విరుచుకుపడ్డ మంత్రి
- 60 ఏళ్ల పాలనలో ములుగుకు చేసిందేమిటి?
- రాహుల్, ప్రియాంక గాంధీలపై మండిపాటు
- రామప్పను ఏనాడైనా పట్టించుకున్నారా?
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే యునెస్కో గుర్తింపు

హనుమకొండ, అక్టోబర్ 18 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి ఫైర్ అయ్యారు. బుధవారం ములుగులో నిర్వహించిన కాంగ్రెస్ సభ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలపై విరుచుకుపడ్డారు. 60 ఏండ్ల పాలనలో కాంగ్రెస్, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వారి పాలనలో ఏనాడైనా ములుగు అభివృద్ధిపై మాట్లాడిన సందర్భాలున్నాయా? అని మంత్రి ధ్వజమెత్తారు. విభజన హామీల గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించారా? అని ప్రశ్నించారు. అలాగే ములుగు గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కళాశాల మంజూరుపై మాట్లాడారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో వన దేవతలైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదన్నారు. రామప్పను ఎందుకు పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ కృషితోనే రామప్పకు యునెస్కో గుర్తింపు రావడంతో పాటు అంతర్జాతీయ వారసత్వ సంపదగా గౌరవం దక్కిందని మంత్రి అన్నారు. ములుగు జిల్లాను చేసింది కూడా సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ములుగులో మెడికల్ కాలేజీ, జిల్లా ఆస్పత్రిని ఏర్పాటు చేసి, ఏటూరు నాగారంను డివిజన్ కేంద్రం చేసి పరిపాలనను ప్రజల ముంగిట్లోకి తెచ్చింది కేసీఆర్ కాదా? మీ పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ములుగును అభివృద్ధి చేసింది కేసీఆర్ కాదా? అని మంత్రి ప్రశ్నించారు. ములుగు ప్రజల ఆకాంక్షలను గౌరవించి అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. బీడు వారిన అటవీ ప్రాంతం ఈ రోజు పచ్చని తోరణంలా మారిందన్నారు. ఇంటర్నేషనల్ టూరిజం కేంద్రంగా ఇవాళ ములుగు నిలిచిందన్న మంత్రి ఎర్రబెల్లి.. ఎన్నికలు వచ్చినపుడు మాత్రమే వచ్చే మీ లాంటి టూరిస్టులను ప్రజలు నమ్మరని అన్నారు. దొరికిన దొంగలను వెంటేసుకుని తిరిగితే, మిమ్మల్ని కూడా దొంగలాగే చూస్తారని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు నమ్మేది బీఆర్ఎస్‌ను, సీఎం కేసీఆర్‌నే అని అన్నారు. సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించి బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొస్తారని మంత్రి ఎర్రబెల్లి పేర్కొన్నారు. ములుగులో గెలిచేది సీతక్క కాదని, బడే నాగజ్యోతిని ప్రజలు ఆశీర్వదిస్తారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

